



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 2 ఆగస్టు 2025 పేజీలు 8


# విప్లవాత్మకంగా ఆటో మ్యుటేషన్ సేవలకు శ్రీకారం



- ఆటో మ్యుటేషన్‌తో రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకం
- ఒకేరోజు ఒకేచోట తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్‌తో పాటే తక్షణ మ్యుటేషన్
- ఈజ్ ఆఫ్ డూయింగ్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ సర్వీసులు
- ప్రజలందరూ అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** ఆటో మ్యుటేషన్ ప్రక్రియకు శ్రీకారంచుట్టడం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకమయ్యాయని.. ఇదో విప్లవాత్మకమైన మార్పు అని, కొత్త విధానంలో ఒకేరోజు ఒకే చోట చాలా తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్‌తో పాటే తక్షణ మ్యుటేషన్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలోని 17 మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో శుక్రవారం ఆటో మ్యుటేషన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎంతో కలిసి నగరంలోని గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ అవుతున్న ప్రక్రియను పరిశీలించారు. నగరంలోని చిట్టినగర్‌కు చెందిన నంబూరు సామ్రాజ్యలక్ష్మి కొనుగోలు చేసిన రెసిడెన్షియల్ ఆస్తి రిజిస్ట్రేషన్, ఆటో మ్యుటేషన్ ప్రక్రియను స్టెప్ 1 మొదలు స్టెప్ 7 వరకు మిగతా 2లో...



## వరద ప్రమాదం

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ ధీరజ్ వినీల్

వివరాలు 2లో



## గౌరవప్రద జీవితానికి ఎన్‌టీఆర్ భరోసా

**అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పెన్షన్ల పంపిణీ**

**జిల్లా ప్రత్యేక అధికారి, సీసీఎల్‌ఏ జి.జయలక్ష్మి**

**విజయవాడ, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** పేద ప్రజలకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు వీలుకల్పిస్తున్నాయని ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి, సీసీఎల్‌ఏ జి.జయలక్ష్మి అన్నారు. విజయవాడ అర్బన్ పరిధిలోని 22వ డివిజన్ భ్రమరాంబపురంలో సీసీఎల్‌ఏ జయలక్ష్మి అధికారులతో కలిసి లబ్దిదారులకు సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియ గురించి అడిగి తెలుసు కొని.. ఏవైనా సమస్యలు ఉంటే చెప్పండని అన్నారు. ఎక్కడా ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్లవద్దే అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామన్నారు. మిగతా 2లో

## ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం.. సంక్షేమంలో సమున్నత పయనం...

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



వివరాలు 8 లో

విద్యార్థుల భవిష్యత్తుకు

## రూట్ టు రైజ్...



వివరాలు 5లో..

పాత ఎడ్లంక గ్రామానికి

## వరద తాకిడి



వివరాలు 3లో...

(మొదటిపేజీ తరువాయి)

## గౌరవప్రద జీవితానికి ఎన్‌టీఆర్ భరోసా



జిల్లాలో సామాజిక భద్రత పెన్షన్ల ద్వారా 2,30,688 మంది లబ్ధిదారులకు రూ. 99.41 కోట్లు మేర పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. అదేవిధంగా ఆగస్టు నుంచి జిల్లాలో 4,138 స్పౌజ్ పెన్షన్లు (రూ. 1.65 కోట్లు) మంజూరైనట్లు ప్రత్యేక అధికారి జయలక్ష్మి తెలిపారు.

**ఆత్మీయతతో పలకరించి పెన్షన్లు అందించి :** శుక్రవారం విజయవాడ అర్బన్ పరిధిలోని పటమటలంకలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి కష్టసుఖాలను అడిగితెలుసుకున్నారు. కొత్తగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు కూడా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు.

## కృష్ణా నదికి వరద ప్రమాదం

**లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ ధీరజ్ వినీల్**



**తోట్లవల్లూరు ఆగస్టు 1 మేజర్ న్యూస్ :** ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా కృష్ణానదికి వరద రావడంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారని, దీంతో లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుడివాడ డిఎస్పి వి.ధీరజ్ వినీల్ విజ్ఞప్తి చేశారు. ఎగువ జలాశయాల నుండి పెద్ద సంఖ్యలో నీరు విజయవాడ ప్రకాశం బ్యారేజ్ చేరడంతో శుక్రవారం ఉదయం 2 లక్షల18 వేల క్యూసెక్కులకు పైగా నీటిని కిందకు విడుదల చేశారన్నారు. మొత్తం వరద నీటిని నదులు, కాలువలకు విడుదల చేయడంతో నీటి ప్రవాహం ఉధృతంగా ఉందన్నారు. రానున్న రెండు రోజులలో దిగువకు విడుదల చేసే నీటి పరిమాణం 5 లక్షల 66 వేల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందన్నారు. కావున లంక గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండి వరద ముంపు నుంచి బయటపడాలని సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక సిబ్బందితో కలిసి పడవపై పాములలంక గ్రామానికి చేరుకుని అక్కడ గ్రామస్తులకు పలు సూచనలను అందించారు. అలాగే తహసిల్దార్ ఎం.కుసుమకుమారితో ముంపుకు గురయ్యే ప్రాంతాల గురించి వివరాలు అడిగి తెలుసుకుని, వరద ఎక్కువగా వస్తే తీసుకోవాల్సిన సహాయ చర్యలు గూర్చి ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల సీఐ వై.చిట్టి బాబు, స్థానిక ఎస్సై సిహెచ్.అవినాష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నందిగామ పట్టణంలో చైన్ స్నాచింగ్

**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** పట్టణంలో మహిళల మెడలో బైక్ పై వచ్చి బంగారం లాక్కెళ్ళిన దుండగులు సంఘటన శుక్రవారం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 1:40 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్ వచ్చి నందిగామ కె.వి.ఆర్ కాలేజ్ వద్ద నడిచి వెళుతున్న మహిళ మెడలోని బంగారం గొలుసు బలవంతంగా లాక్కొని వెళ్లారు. అనంతరం కొద్ది సమయానికి నందిగామ లోనే పాత బైపాస్ రోడ్ లో నంది విగ్రహం సెంటర్లో ఇద్దరు యువకులు పల్సర్ బైక్ పై వచ్చి లింగాలపాడు వైపు స్కూటీ పై వెళ్తున్న అత్తా కోడళ్లను వెంబడించి స్కూటీ వెనక కూర్చున్న అత్త మెడలోని 32 గ్రాముల బంగారం గొలుసు దుండగులు లాక్కెళ్లారు. పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రాప్లింగ్ కుస్తీ పోటీలో నందిగామ విద్యార్థుల ప్రతిభ




**నందిగామ ఆగస్టు 1, మేజర్ న్యూస్:** చత్తీస్గఢ్ లో జరిగిన గ్రాప్లింగ్ కుస్తీ పోటీలలో నందిగామ వాసి ఓర్సు ఏడుకొండలరావు కుమారుడు ఓర్సు వెంకటేశ్వర్‌రాజు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఆగస్టు 26 నుంచి 29 వరకు చత్తీస్గడ్ రాష్ట్రంలో జరిగిన ఐదవ జాతీయ స్థాయి గ్రాప్లింగ్ కుస్తి పోటీల్లో 66 కేజీల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రజిత పథకం సాధించాడు. రాష్ట్ర గ్రాప్లింగ్ అధ్యక్షులు ఎం.సురేందర్ రెడ్డి, కోచ్ వి.హరి కుమార్ అభినందనలు తెలియజేశారు. నందిగామ పట్టణ ప్రాంతానికి చెందిన విద్యార్థికి జాతీయస్థాయిలో రజక పథకం రావడంతో పట్టణ ప్రముఖులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

# విప్లవాత్మకంగా ఆటో మ్యుటేషన్ సేవలకు శ్రీకారం



(మొదటిపేజీ తరువాయి)

చివరగా మ్యుటేషన్ సర్టిఫికేట్ జనరేట్ అయినంత వరకు ప్రక్రియను పరిశీలించారు. ఇదంతా అరగంటలోనే పూర్తికావడంతో ఇరు పార్టీలు ప్రభుత్వ సేవల్లో వేగంపై ఆనందం వ్యక్తం చేశాయి. కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్రలు లబ్ధిదారుకు మ్యుటేషన్ సర్టిఫికేట్ అందజేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ ఆస్తి రిజిస్ట్రేషన్ తర్వాత మునిసిపల్ రికార్డుల్లో యజమాని పేరు మారాలంటే రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత డాక్యుమెంట్లతో మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవడం, అక్కడ ఆ ప్రక్రియ పూర్తికి కూడా కొంత సమయం పట్టడం జరుగుతుండేదని.. ఇప్పుడు ప్రభుత్వం తెచ్చిన ఆటో మ్యుటేషన్ వల్ల ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ కూడా పూర్తవుతుందని.. మునిసిపల్ డేటా బేస్‌లో ఆటోమేటిక్‌గా యజమాని పేరు మారిపోతుందని వివరించారు. ఆటో మ్యుటేషన్ వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని, రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే మ్యుటేషన్ జరిగిపోతుందన్నారు. డాక్యుమెంటేషన్ వర్క్ తగ్గడమే కాకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందుతాయన్నారు. రిజిస్ట్రేషన్, మునిసిపల్ డిపార్టుమెంట్ల డేటాబేస్ అనుసంధానంతో సరళీకృత సేవలు లభిస్తాయన్నారు. సేవలపై ప్రజలకు విశ్వాసాన్ని, సంతృప్తి స్థాయిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆటోమ్యుటేషన్ మంచి ఉదాహరణ అని.. ఈ విధానాన్ని అందుబాటులో ఉంచిన గౌరవ ముఖ్యమంత్రికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**పట్టణ డిజిటల్ పాలనలో కీలక మైలురాయి: కమిషనర్ ధ్యానచంద్ర**

ఆటో మ్యుటేషన్ అనేది పట్టణ డిజిటల్ పాలనలో కీలక మైలురాయి అని.. మ్యుటేషన్ కోసం మునిసిపల్ కార్యాలయానికిగానీ వార్డు సచివాలయానికిగానీ వెళ్లాల్సిన అవసరం లేకుండానే రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మ్యుటేషన్ పూర్తవుతుందని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. దీనివల్ల రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మునిసిపల్ డేటా బేస్‌లో పేరు నమోదవుతుందని పేర్కొన్నారు. విజయవాడ అర్బన్ పరిధిలోని నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. 64 డివిజన్ల ప్రజలు అవగాహన పెంచుకొని, సద్వినియోగం చేసుకోవాలని ధ్యానచంద్ర కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎ.రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్, సబ్ రిజిస్ట్రార్లు ఎండీ ఆరిఫ్, కె.వెంకటేశ్వర్‌రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఎన్టీఆర్ భరోసా కింద 178 మందికి కొత్త పెన్షన్లు



**రెడ్డిగూడెం, ఆగస్టు1, మేజర్ న్యూస్:** శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సహకారంతో మంజూరైన నూతన పెన్షన్లను శుక్రవారం మండలంలో అర్హులైన పెన్షన్ దారులకు మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వర రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ముప్పిడి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈరోజు పెన్షన్ పొందిన ప్రతి ఒక్కరి వెనుక ఒక శ్రద్ధగల నాయకుని పట్టుదల ఉంది. ఈ పెన్షన్లు మంజూరు కావడానికి ముఖ్య భూమిక పోషించినవారు మన శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్. ప్రజల సమస్యలను అధికారులకు వివరించి, ప్రతీ అర్హుడి పెన్షన్ ఆమోదించుకునే వరకు అధికార వ్యవస్థను చైతన్యపరిచిన ఘనత ఆయన సొంతం అని అన్నారు. రాష్ట్రంలో 70 లక్షలకు పైగా కుటుంబాలకు 4000, 6000, 10000, 15000 రూపాయల వరకు పెన్షన్లు అందజేస్తున్న ఒకే ఒక్క ప్రభుత్వం, అది మన తెలుగుదేశం ప్రభుత్వమే. దేశం మొత్తం మీద ఈ స్థాయిలో సంక్షేమం అందిస్తున్న ఏ రాష్ట్రం లేదు. ఇది చంద్రబాబు విజయవంతమైన, దూరదృష్టి కలిగిన పరిపాలన ఫలితం అని గర్వంగా తెలిపారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకుల ద్వారా ఈ కొత్త పెన్షన్ పంపిణీ చేశారని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో జానలపాటి వేణుగోపాల రెడ్డి, డి సి చైర్మన్ కొల్లి శ్రీనివాస్ రెడ్డి, పైడిమర్ల కిరణ్ కుమార్ రెడ్డి, రెడ్డి గూడెం సొసైటీ అధ్యక్షులు ఉయ్యూరు సుబ్బారెడ్డి, రెడ్డిగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు చాట్ల చంద్రా, మల్లాది పోతురాజు, ఉయ్యూరు రామ్మోహన్ రెడ్డి, పోతురాజు బాలకృష్ణ, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొత్తగా పెన్షన్ పొందిన వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలు నాగేశ్వరరెడ్డిని, ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## మండలంలో నూతనంగా 88 స్పౌస్ పెన్షన్లు మంజూరు

**పెదపారుపూడి ఆగస్టు 1 మేజర్ న్యూస్:** మండలం లో కొత్తగా మరో 88 మంది మహిళలకు వితంతు పింఛన్లు ఎన్టీఆర్ భరోసా పథకం క్రింద మంజూరు అయ్యాయని, శుక్రవారం పెన్షన్ల పంపిణీ లో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు ముఖ్యనాయకులతో కలిసి వారి వారి ఇళ్ల వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను అందించడం జరిగిందని పెదపారుపూడి మండల ఇంచార్జి ఎంపీడీఓ వంగా శ్రీనివాస్ తెలిపారు. ప్రతినెలా ఒకటవ తేదీనే పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో ఈ ఉదయం మండలం లోని తమ్మలంపాడు, దోసపాడు, దూళ్లవానిగూడెం, మహేశ్వరపురం, గుర్విందగుంట, పెదపారుపూడి గ్రామాలను సందర్శించి పెన్షన్స్ పంపిణీ లో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం ఈ నెలలో స్పౌస్ పెన్షన్స్ పేరుతో గతంలో పెన్షన్ తీసుకుంటూ మరణించిన వ్యక్తుల భార్యలకు పింఛన్లు మంజూరు చేసిందని, దీనిలో భాగంగా మండలంలోని భూషణగుళ్ల గ్రామసచివాలయం పరిధిలో 4, చినపారుపూడి గ్రామ సచివాలయ పరిధిలో 12, దోసపాడు గ్రామ సచివాలయ పరిధిలో 10, యలమర్రు గ్రామ సచివాలయ పరిధిలో 14, మోపర్రు గ్రామ సచివాలయ పరిధిలో 8, పెదపారుపూడి గ్రామ సచివాలయ పరిధిలో 11, వానపాముల గ్రామ సచివాలయ పరిధిలో 12, వెంట్రప్రగడ-1 సచివాలయపరిధిలో10, వెంట్రప్రగడ-2 సచివాలయపరిధిలో 7 మొత్తం 88 మంజూరు అయ్యాయని అని తెలిపారు. కాగా మొదటి రోజు మండలం లోని మొత్తం పింఛన్లలో 93% పింఛన్ల పంపిణీ పూర్తిపూర్తి చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

## తమది చేతల ప్రభుత్వం.. అందుకే ఒకేరోజు లక్ష తొమ్మిది వేల పింఛన్లు మంజూరు: ఎమ్మెల్యే కుమార్ రాజా


**తోట్లవల్లూరు ఆగస్టు 1 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని వల్లూరుపాలెం గ్రామంలో 13 మందికి నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లను స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా భర్త పింఛను తీసుకుంటూ మరణించిన భార్యకు పింఛన్ అందించకుండా గత ప్రభుత్వం పేదలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక వీటిపై పరిశీలన జరిపి నూతనంగా వితంతువులకు పింఛన్లను మంజూరు చేయడం జరిగింది అన్నారు. ఎక్కడా లేని విధంగా ఒకేరోజు లక్ష తొమ్మిది వేల పింఛన్లను నూతనంగా మంజూరు చేసి అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని, అందుకే ప్రజలందరూ మంచి ప్రభుత్వం అని అంటున్నారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరామ ప్రసాద్, పార్టీ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలి వెంకట కృష్ణారావు శత జయంతికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు

**ఆగస్ట్ 4న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రారంభ సభ**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 4వ తేదీ విజయవాడలో తెలుగు జాతి రత్నం, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విస్తృత ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ప్రారంభ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా ముద్రించిన 'ఏ లైట్ హౌస్ ఇన్ ద స్టార్మ్' పుస్తకం ఆవిష్కరిస్తారు. విశ్వయోగి విశ్వంజీ అభిభాషణం చేస్తారు. సభకు ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరావు అధ్యక్షత వహిస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రంగాల ప్రముఖులు విచ్చేయనున్నారు.

## అన్నదాత సుఖీభవ ద్వారా 29,718 మందికి లబ్ది



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నియోజకవర్గంలో 29,718 మంది రైతులకు రూ.20 కోట్ల 80 లక్షల 26వేలు లబ్ది చేకూరనుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన అవనిగడ్డలో తమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అవనిగడ్డ మండలంలో 2,636 మంది రైతులకు రూ.1,84,52,000లు, మోపిదేవి మండలంలో 4,975 మంది రైతులకు రూ.3,48,25,000లు, కోడూరు మండలంలో 6,173 మంది రైతులకు రూ.4,32,11,000లు, నాగాయలంక మండలంలో 5,600 మంది రైతులకు రూ.3,92,00,000లు, ఘంటసాల మండలంలో 5,510మంది రైతులకు రూ.3,85,70,000లు, చల్లపల్లి మండలంలో 4,824 మంది రైతులకు రూ.3,37,68,000లు లబ్ది కలుగనుందని వివరించారు.

# పాత ఎడ్లంక గ్రామానికి వరద తాకిడి





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కృష్ణానది గర్భంలో ఉన్న పాత ఎడ్లంక గ్రామానికి వరద తాకిడి కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామం కృష్ణానది గర్భంలో ఉండటంతో ఆ గ్రామానికి వెళ్లేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కాజ్ వే వరద తాకిడికి కొట్టుకుపోయింది దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచనల మేరకు అధికారులు ఆ ప్రాంతానికి తరలివచ్చారు. తహసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు ఆదేశాలతో ఎడ్లంక గ్రామస్తుల రాకపోకల కోసం పడవలను ఏర్పాటు చేశారు. ఎస్సై కే శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలను చేపట్టారు. హెల్త్ డిపార్ట్మెంట్ వారు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ప్రజలకు తగు సూచనలు చేశారు. ఎమ్మెల్యే తనయుడు యువనాయకులు మండలి వెంకట్రామ్ నాయకత్వంలో కూటమి నేతలు వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, నాయకులు కొల్లూరి వాసు, కొల్లూరి ఇమ్మానియేల్, అన్నపరెడ్డి వెంకటస్వామి, భోగిరెడ్డి బుజ్జిబాబు, దామెర్ల సతీష్, షేక్ బాబావలీ తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణాపురంలో రామ మందిర నిర్మాణానికి శంకుస్థాపన

**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో పునర్నిర్మాణం చేపడుతున్న రామ మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్దినేని చంద్రరావు, ఇంకొల్లు మురళి, ఇంకొల్లు సత్యనారాయణ, ముదినేని గంగా ప్రసాద్, పాతబోయిన సీతారత్న సాయిబాబా, కూటమి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా 725 ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు

**విజయవాడ/ఢిల్లీ, మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తంగా అత్యాచారాలు, పోక్సో చట్టం కింద నమోదైన కేసులను వేగంగా పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు ఇప్పటివరకు లక్షలాది కేసులను పరిష్కరించాయి.దేశ వ్యాప్తంగా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు 725 కోర్టులు వున్నాయి. వీటిలో 392 ప్రత్యేక పోక్సో కోర్టులు ఉన్నాయి. ఇప్పటివరకు ఈ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాల్లో 5.38 లక్షలకు పైగా కేసులు దాఖలవగా, 3.34 లక్షలకుపైగా కేసులు పరిష్కారమైనట్లు శుక్రవారం లోక్ సభలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ శాఖ, న్యాయశాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) అర్జున్ రామ్ మేఘవాల్ వెల్లడి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రాయోజిత పథకంగా అమలవుతున్న ఈ పథకాన్ని 31 మార్చి 2026 వరకు కొనసాగుతుందని, దేశవ్యాప్తంగా 790 కోర్టులు ఏర్పాటు చేయాలని లక్ష్యం తో రూ.1952.23 కోట్లు ఖర్చు చేయనున్నట్లు, ఇందులో రూ. 1207.24 కోట్లు కేంద్ర భాగంగా నిర్భయ నిధి నుంచి వెచ్చించనున్నట్లు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ వెల్లడించారు. ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు ఆంధ్రప్రదేశ్‌లో 16 వున్నాయని, 2019 నుండి ఇప్పటివరకు ఏపీకి రూ. 1.8 కోట్లు మాత్రమే విడుదల చేసినట్లు వివరించారు. దేశ వ్యాప్తంగా 2019 నుండి ఇప్పటివరకు రూ. 1034.55 కోట్లు విడుదల చేసింది. ఇక ఏపీలో ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు పోక్సో కేసులు పరిష్కరించడానికి సగటున 257 రోజులు సమయం పట్టిందన్నారు. మౌలిక వసతుల పెంపు కోసం కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. 2014లో దేశ వ్యాప్తంగా 15,818 కోర్టు హాల్లు ఉండగా, ప్రస్తుతం అవి 22,372కి, నివాస యూనిట్లు 19,851కి పెరిగాయి.

అదనంగా 3,128 కోర్టు హాల్లు, 2,772 నివాస యూనిట్లు నిర్మా ణంలో ఉన్నాయని తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు పనితీరును పర్యవేక్షించేందుకు రాష్ట్రాలు, హైకోర్టులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలు జరుగుతున్నా యని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు కేసుల సమయపూర్వక పరిష్కారం కోసం కేంద్రం లేఖలు పంపిందని ఆయన పేర్కొన్నారు. న్యాయమూర్తులు, సిబ్బంది నియామకం రాష్ట్ర ప్రభుత్వాలు, హైకోర్టుల బాధ్యతేనని, సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# సంతూర్ రాయల్ తాజా టీవీ యాడ్లో మీనాక్షి చౌదరి



**విజయవాడ, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** సంతూర్ రాయల్ విప్రో వినియోగదారుల సంరక్షణ, కాంతి అనేది ఒక ప్రీమియం సంతూర్ పోర్ట్‌ఫోలియో కిందకి వస్తుంది. అది కొత్త ట్రిపుల్ సాండిల్ ప్యాక్ ని పరిచయం చేస్తూ దాని చర్మ సంరక్షణ రేంజ్ ని విస్తరించింది. ఈ లాంచ్ ని మీనాక్షి చౌదరీ అనే నటి టీ వీ కమర్షియల్ ద్వారా మద్దతుగా కనిపిస్తుంది. ఈ కొత్త ఆఫర్ మూడు ఉత్పత్తులు అయిన సోప్, స్యాండిల్ వుడ్ ఫేస్ ప్యాక్, సాండిల్ ఫేస్ కరీం ని ఒక దెగ్గరకి చేరుస్తుంది, మూడు దశల చర్మ సంరక్షణలో భాగంగా మెరుగైన పనితీరు ని అందిస్తూ చర్మ సౌందర్యాన్ని పెంచుతూ నల్ల మచ్చలను తగ్గిస్తుంది. ఎం ఎస్ పరిశోధన క్లినిక్ నిర్వహించిన క్లినికల్ అధ్యయనం ప్రకారం ఒక వారం రోజుల వాడుక తరువాత మెరుగైన మెరుగుదల చూశామని అని రెజిమెన్ వివరించారు. టాన్ తగ్గడం మాత్రమే కాకుండా నాలుగో వారంలో నల్ల మచ్చలు కుడా తగ్గి మంచి కాంతిని గమనించారు. ఈ ఫార్ములా ని డెర్మటాలజీ ప్రకారం టెస్ట్ చేశారు. ఇది అన్ని రకాల చర్మాల వారికి సరిపోతుంది. ఇప్పటి యువ వినియోగదారులు వారి చర్మ సంరక్షణ గురించి ఎక్కువగా పట్టించుకోవడం లేదుబీ వారు ఈ బిజీ జీవితానికి సరిపోయే ఎలాంటి ఇబ్బంది లేని మెరుగైన పరిష్కారాలను అన్వేషిస్తున్నారు. కొత్త ట్రిపుల్ స్యాన్డిల్ ప్యాక్ అనేది పెరుగుతున్న వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేసారు. పూర్తిగా స్యాన్డిల్ వుడ్ తో తాయారు చేసిన నమూనా అనేది సాన్డిల్ వుడ్ సీరం ని కలిగి ఉంటుంది, పూర్తి రొటీన్ యొక్క ప్యాక్ ఇక్కడ సౌకర్యవంతంగా మనకి దొరుకుతుంది. మేము పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు చర్మం గురించి ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలి అనుకునే వినియోగదారులను చేరుకోవాలి అనుకుంటున్నాం." అని విప్రో వినియోగదారుల సంరక్షకులు, లైటెనింగ్ మార్కెటింగ్ యొక్క సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అయిన ఎస్ ప్రసన్న రాయ్ లాంచ్ గురించి మాట్లాడుతూ అన్నారు. టిల్ట్ బ్రాండ్ సొల్యూషన్స్ అభివృద్ధి చేసిన ఈ టీవీ వాణిజ్య ప్రకటన ఆశ్చర్యకరమైన మలుపు తీసుకుని, ప్రేక్షకులకు ప్రముఖుల జీవితాల్లోకి ఒక స్నీక్-పీక్ ఇస్తుంది. ఒక సినిమా షూటింగ్ వెనుక, మీనాక్షి చౌదరి తన చర్మ సంరక్షణ దినచర్యను – సంతూర్ రాయల్ శాండల్ సబ్బు, ఫేస్ ప్యాక్ – తెరపై, జీవితంలో తన రోజువారీ ప్రకాశానికి కారణమని వెల్లడించడానికి ప్రేక్షకులతో నేరుగా సంభాషణ చేస్తుంది. ఈ కథనం ద్వారా, మీనాక్షి టాలీవుడ్‌లో ప్రధాన నటిగా వచ్చే గ్లామర్ ద్వారా దాగి ఉన్న ఒక అందమైన అమ్మాయిని కూడా వెల్లడిస్తుంది. "అందాల వర్గం అభివృద్ధి చెందుతోంది,, సంతూర్ రాయల్ శాండల్ సోప్ ం సీరం నిజంగా ప్రత్యేకమైన ప్రతిపాదనను అందిస్తుంది. అది నమ్మకం, సంప్రదాయంలో పాతుకుపోయిన ప్రకాశాన్ని పెంచే ఫార్ములా. ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా చేసేది అంతర్దృష్టి. ఆమె స్టార్ కావడానికి ముందు, మీనాక్షి కేవలం ఒక చిన్న అమ్మాయి, చాలా మంది ఇతరుల మాదిరిగానే అభిమాని. ఆరాధన నుండి ఆకాంక్ష వరకు ఆ ప్రయాణం భారతదేశంలోని ప్రతి అమ్మాయితో సంబంధం కలిగి ఉంటుంది. ఇది ప్రామాణికమైనది, భావోద్వేగమైనది, మా ప్రేక్షకులతో లోతుగా ప్రతిధ్వని స్తుంది. " అని టిల్ట్ బ్రాండ్ సొల్యూషన్స్ యొక్క సి సి ఓ ఆదర్శ్ అటల్ జోడించారు. చందనం చర్మం మాడకుండా ఉంచడానికి సహాయపడుతుంది, అది చర్మానికి కాంతి ని ఇస్తుంది. "సంతూర్ రాయల్ సాన్డిల్ సోప్, ఫేస్ సీరం వలన ఒక్క వారం లోనే చర్మం యొక్క కాంతి మెరుగుపడుతుంది అని గుర్తించారు. అలాగే నాలుగు వారాలు పాటు వాడితే మరింత ఎక్కువ మార్పులు కనిపిస్తాయి అని సూచించారు." అని విప్రో వినియోగదారుల సంరక్షణ, లైటెనింగ్ యొక్క ఆర్ & డి హెడ్ అయిన వీరేంద్ర ఆర్ త్రిపాటి అన్నారు. సంతూర్ సాన్డిల్ ట్రిపుల్ సాన్డిల్ ప్యాక్ ఇప్పుడు అన్ని రీటైల్, ఈ కామర్స్ వేదికలలో ప్రపంచం అంతటా అందుబాటులో ఉంటుంది.

## సామ్‌సంగ్, స్టార్టప్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం



**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, దేశంలోని మారుమూల ప్రాంతాల నుండి యువ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడానికి, సామ్‌సంగ్ ఫర్ టుమారోతో దేశ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి భారత ప్రభుత్వ ప్రధాన చొరవ స్టార్టప్ ఇండియాతో ఒక వ్యూహాత్మక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఒప్పందం సామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో, స్టార్టప్ ఇండియా ఇంక్యుబేషన్, మెంటర్‌షిప్, విధాన మద్దతు బలమైన జాతీయ పర్యావరణ వ్యవస్థను మిళితం చేస్తుంది. మౌలిక సదుపాయాలు, నిపుణుల మార్గదర్శకత్వం, మార్కెట్ లింకేజీలు, నిధుల అవకాశాలను అందించడం ద్వారా ముఖ్యంగా ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాల నుండి అధిక సామర్థ్యం గల ప్రతిభను గుర్తించి పెంపొందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యమని సామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్పీ చున్ పేర్కొన్నారు.

## అర్హులందరికీ పింఛన్లు అందించడమే కూటమి లక్ష్యం




**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రతా పింఛన్లకు అర్హులైన వారందరికీ అందిస్తున్నామని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 14వ డివిజన్ పటమట ఎన్.ఎస్.ఎం స్కూల్ వెనుక 283 సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైనా స్పౌజ్ పెన్షన్ల కార్యక్రమంలో గద్దె క్రాంతి కుమార్ పాల్గొని సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు పింఛన్ ఇచ్చే విధానాన్ని గత వైకాపా ప్రభుత్వం విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో 2019 నుంచి 2024 అక్టోబర్ మధ్య భర్తను కోల్పోయి వితంతు పించను కోసం వేచి చూస్తున్న మహిళలకు ఈ పింఛ అందిస్తున్నామని తెలిపారు. వైఎస్ఆర్సీపీ పాలనకు కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నర్రా కిషోర్, గరికిపాటి శ్రీనివాస్ (బద్రి), కర్ణా రమేష్, దాంగే కుమారి, యల్లబాబు, కాళ్ళ రమేష్, షేక్. ఫాతిమా, వెంకటరెడ్డి, చెరుకూరి సాంబయ్య, నాసర్ వలి, చిన్నా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన కాకతీయ సీబీఎస్ఈ విద్యార్థి



**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్:** ఈ నెల 3 తేదీ నుండి 7 తేదీ వరకు గుజరాత్ లోని అహ్మదాబాద్ నరసరావుపూర్ స్పోర్ట్స్ క్లబ్‌లో 51వ జూనియర్ ఛాంపియన్‌షిప్ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పూల్ నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఎఫ్ఐ స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించడం నిర్వహించారు. ఈ పోటీలలో నందిగామ కాకతీయ స్కూల్ నుండి ఎస్ కీర్తన్ అనే విద్యార్థి బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్ విభాగంలో ఎంపిక అయ్యారు.జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థికి కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్, భారతి,కాకతీయ డైరెక్టర్ కాపా కార్తికేయ, సుష్మా ప్రిన్సిపల్ సత్యమూర్తి, ఉపాధ్యాయులు,, స్విమ్మింగ్ కోచ్ గోపీచంద్ విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, జాతీయ స్థాయిలో కూడా నందిగామ పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

## వర్ల రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**పెదపారుపూడి ఆగస్టు 1 మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి వర్ల రామయ్య పుట్టిన రోజు సందర్భంగా మండల పరిధిలోని పలువురు నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు నత్తా వాణి, మండల విలేకరి అధ్యక్షుడు నత్తా భూషణ్ కుమార్, రాష్ట్ర అరుంధతి బంధు సంక్షేమ అధ్యక్షుడు పెదపూడి కాంతారావు, టిడిపి సీనియర్ నాయకులు వర్ల రామయ్యను కలిసి పుష్పగుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు రూట్ టు రైజ్...





**ఇటువంటి కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించాలి**

**ఒంగోలు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీ**

**అమరావతి, మేజర్ న్యూస్ :** చిన్ననాటి నుంచే పిల్లల బాధ్యతలను తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా తీసుకోవాలి. వారి ఆలోచన విధానంను గమనిస్తూ వారిని ప్రోత్సహిస్తూ ఉండాలి. ఒకవేళ తెలియక వేరే మార్గాలలో ఆలోచనలు చేస్తూ ఉంటే తల్లిదండ్రులు దగ్గర కూర్చోబెట్టుకొని అన్ని విషయాలను విడమర్చి చెప్పాలి. ఈ విధంగా తల్లిదండ్రులు తమ బిడ్డలను తీర్చిదిద్దుతూ ఉంటే ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. పిల్లలు సక్రమమైన ఆలోచనలతో ముందుకెళుతూ భవిష్యత్తులో ఉన్నతులుగా నిలుస్తారు. విద్యార్థి దశ నుండే విద్యార్థునులు, విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును కలిగించడానికి, నిరాశ్రయులైన మహిళలకు ఆసరా కలిగించడానికి ఉమెన్స్ త్రైవ్ ఫౌండేషన్, రూట్ టు రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రషీదా బేగం షేక్ ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కువైట్ లో ఉద్యోగం చేస్తున్న రషీదా బేగం ఆలోచనలన్నీ విద్యార్థిని, విద్యార్థుల భవిష్యత్తుపై అణగారిన మహిళలు జీవితంలో ఏ విధంగా స్థిరపడతారు అన్న నిరంతర ఆలోచనల నుంచి పుట్టిందే ఈ ఆర్గనైజేషన్లు. ఆమె స్థిరమైన అభిప్రాయాలను తెలుసుకున్న పలువురు మేధావులు, ఉన్నతాధికారులు, విద్యావంతులు,డాక్టర్లు, మహిళలు మద్దతు పలికారు. రషీదా బేగం షేక్ ప్రారంభించిన ఫౌండేషన్లకు అతి తక్కువ కాలంలోనే దాదాపు 5 లక్షల మంది సభ్యులుగా చేరారు. అందులోంచి తొమ్మిది మందిని ఆమె డైరెక్టర్లు గా నియమించారు.ఈ నేపథ్యంలో రూట్ టు రైజ్ త్రైవ్ ఫౌండేషన్ గురించి రషీదా ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీని కలిసి విద్యార్థుల భవిష్యత్తును గురించి తను స్వయంగా సిద్ధం చేసిన పథకాలను గురించి వివరించారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థుల భవిష్యత్తుకు ఇటువంటి ఆలోచనలే ముఖ్యమని తలంచారు.వెంటనే పలు పాఠశాలలో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు.

జూన్ 17న ఒంగోలులో డి.ఎం.ఆర్. మున్సిపల్ హైస్కూల్లో రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఒక అద్భుతమైన కెరీర్ గైడెన్స్ ఎగ్జిబిషన్ ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీ,ఎస్పీ అశోక్ బాబు,నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు విశేష సహకారం అందించారు. దాదాపు 200 మంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి 15 విభాగాలకు ప్రాతినిధ్యం వహించే స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం, పోలీసు శాఖ, ఆర్మీ విభాగం, ఆరోగ్య, ట్రాఫిక్, హైజెనిక్స్, ఉమెన్ చిల్డ్రన్ వెల్ఫేర్,ఇంజనీరింగ్ శాఖలతో పాటు పలు శాఖలు పాల్గొన్నాయి.న్యాయవాదులు కూడా విచ్చేసి భాగస్వాములయ్యారు. నాలుగో తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థి, విద్యార్థునులకు వివిధ విద్యా మార్గాలు, ఉద్యోగ అవకాశాలు,లైఫ్ స్టైల్ తదితర అంశాలపై సమగ్ర అవగాహనను రషీదా బేగం షేక్ కల్పించారు.

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తూ ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి కార్యక్రమాలు జరగాలన్నారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీ విద్యార్థులతో కలిసిపోయి తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకొని ఆత్మీయులయ్యారు.ఈ కార్యక్రమంలో రూట్ టు రైజ్ త్రైవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రషీదా బేగం షేక్ తో పాటు డైరెక్టర్లు కావూరు లక్ష్మీ వరప్రసాద్, అబ్దుల్ రఫీ,దిలీప్ రెడ్డి, అమిత్ బాబు కో ఫౌండర్ వడ్లమూడి రాధ, అశ్విని రెడ్డి, కావూరి ప్రసన్నలక్ష్మి, వనిత, ఎస్ ఆర్ దేవి, మహినూర్, తేజోవతి,ప్రభుజ్యోతి,శ్రీనివాస రావు, ఇంబ్రాన్ షేక్, జయమ్మ తదితరులు ఉత్సాహంగా పాల్గొని విద్యార్థుల సందేహాలను సందేశాత్మకంగా తీర్చారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేసిన గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కానూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ఇంటింటికి పెన్షన్ పంపిణి కార్యక్రమం ఉదయం 6.30 గంటల నుండి ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామంలో 439 పెన్షన్లకు గాను 20.13 లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగిందన్నారు. తెల్లవారుజామునే పెన్షన్లు ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, కృతజ్ఞతలు తెలియజేసారు. ముఖ్యంగా స్పౌజ్ పెన్షన్ల పంపిణీ మరో విజయం అన్నారు. కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు, మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని 'గోపు' కోరారు. శనివారం రైతులకు అన్నదాత సుఖీభవ క్రింద, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 7000/– రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర రావు,జనసేన పార్టీ ఇంచార్జి దివి మహేష్, ఏడుకొండలు, పెద ఏడుకొండలు,పీతా రాము,బొలిశెట్టి నాని,కాశీ, జొన్నల నాగమల్లేశ్వర రావు, సిద్దిరెడ్డి పాండురంగారావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# దిగ్విజయంగా ముగిసిన తాజ్ బాబా ఉరుసు మహోత్సవం

**అతనిజాం బాబాను అభినందించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ**

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని చీమలపాడు లో వేంచేసి ఉన్న సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దివ్య ఆశీస్సులతో జంపని గ్రామంలో అత మహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరిబాబా( నిజాం బాబా) వారి ఆధ్వర్యంలో తాజ్ బాబా ఉరుసు మహోత్సవ అన్నదాన కార్యక్రమం లంగర్ షరీఫ్ దిగ్విజయంగా ముగిసింది. మహారాష్ట్రలోని నాగపూర్ షరీఫ్ లో ఉన్న తాజుద్దీన్ తాజుల్ ఔలియా వారి ఉరుసు మహోత్సవానికి జంపని గ్రామము నుండి వందలాది మంది భక్తులతో వెళ్లి నిజాం బాబా వారు అక్కడే ఉండి 15 రోజులు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి అన్నదాన కార్యక్రమం ప్రారంభించి 24 గంటలు కొనసాగింది. దేశ నలుమూలల నుండి ఉరుసు మహోత్సవానికి వచ్చే వేలాదిమంది భక్తులకు ఎంతో ప్రేమతో ఆప్యాయతతో పిలిసి కడుపునిండా భోజనం పెట్టి పంపించేవారు. తాజ్ బాబా వారికి గంధం, పూలు,చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒక మహత్తరమైన మానవతా కార్యక్రమం లంగరే ఆమ్ బాబా తాజ్కే నామ్ అనే కార్యక్రమం ద్వారా లంగర్ షరీఫ్ సేవా కార్యక్రమం నిర్వహించారు. అందరినీ ప్రేమించు అందరికీ సేవ చేయి అనే సూఫీ సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకుని ఈ మహత్తరమైన కార్యక్రమం చేశారు. నిజాం బాబా వారి కుటుంబ సభ్యులు స్వయంగా అన్న ప్రసాదాన్ని చేసి పెట్టేవారు. భక్తులందరికీ ఎంతో నియమ నిష్టతో ఆచరణలో పెట్టి బాబా వారి భావన చాటి వారి కృపకు పాత్రులయ్యారు. ఇంతటి మహత్తరమైన కార్యక్రమాన్ని ప్రారంభించి ఘనంగా దిగ్విజయంగా ముగించారు. ఈ మహత్తరమైన కార్యక్రమంలో అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రము నుండి ప్రత్యేకంగా విచ్చేసిన ఫార్మా కంపెనీ సీఈవో జానీ బి పాల్గొని సేవా కార్యక్రమంలో సేవ చేశారు. దిగ్విజయంగా ఈ కార్యక్రమం ముగియడంతో



ఈ లంగర్ షరీఫ్ సేవా కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి నితిన్ గట్కారిస్వయంగా నిజాం బాబా వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించి అతనిజాం బాబా( ఆంధ్ర రాష్ట్రం జంపని బాబా) మానవతా సేవ గుణాన్ని అభినందించి ప్రశంసించారు. అలానే మహారాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ హజరత్ బాబా తాజుద్దీన్ ట్రస్ట్ నాగపూర్ చైర్మన్ జనం ప్యారేజియా ఖాన్ వారి సహకారం ప్రత్యేకంగా గుర్తించదగింది. ఈ ఊరు మహోత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నప్రసాదాన్ని అందించారు. ఈ ఉరుసు మహోత్సవం మానవత్వం, సేవాభావం, సామాజిక సమైక్యతకు నిలువెత్తు దర్పంగా నిలిచింది. భక్తి ప్రేమ సేవ అనే సూఫీ విలువలను పరాకాష్టకు నిదర్శనంగా అభివృద్ధి చెంది వేలాది మంది భక్తులకు భక్తుల మనోభావాలను ప్రభావితం చేసి భక్తుల్లో ఆధ్యాత్మిక భావన ధార్మిక చింతన మనిషిలో మతం కన్న మానవత్వం గొప్పది అనే సూక్తి ప్రతి ఒక్కరిలో ప్రతి ఒక్కరి మనసులో కుల మత వర్గ విచక్షణ లేకుండా మనమందరం భారతీయులం భారతదేశ సాంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లు దేశ సమైక్యత సమగ్రత సెక్యులరిజాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుతూ అన్నదమ్ముల మెలగాలని ఇంతటి మహత్తరమైన కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముగించటానికి చీమలపాడు బాబా వారి దివ్య ఆశీస్సులే అని నిజాం బాబా తెలిపారు.

## 26వ డివిజన్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన కూటమి నాయకులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో 26 డివిజన్ లో ఒకటో తేదీని పురస్కరించుకొని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు,ఒంటరి మహిళలకు సచివాలయ సిబ్బంది సహకారంతో వార్డు టిడిపిఅధ్యక్షులు చెరుకూరి సూరిబాబు ప్రధాన కార్యదర్శి దిక్కొల్లు వెంకట్రావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ మౌలాలి నాగనబోయినరవి బూత్ ఇన్చార్జిలు వన్నెంరెడ్డి ప్రసాద్,షేక్ భాష కూటమి నాయకుల ఆధ్వర్యంలో పింఛన్లపంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు మాట్లాడుతూ 4375 జనాభా కలిగిన 26 వ డివిజన్ లో 442 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని ప్రతి నెల మొదటి తేదీన సచివాలయ సిబ్బంది సహకారంతో ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. 19 లక్షల 40 వేల రూపాయలను అర్హులైన పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేశామని గడ్డంరాజు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మచిలీపట్నం అభివృద్ధికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రపార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కృషి పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మచిలీపట్నం క్యాపిటల్ సిటీగా అభివృద్ధి చెంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రజలు విశ్వసిస్తున్నారని గడ్డం రాజు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందేలా కృషి చేస్తామని అర్హులైన వారిని గుర్తించడం జరిగిందని రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర దృష్టిలో పెట్టి వారికి కూడా ఫించను వచ్చే అవకాశం కల్పిస్తామని గడ్డం రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి సూరిబాబు, దిక్కొల్లు వెంకట్రావు,షేక్ మౌలాలి, నాగనబోయినరవి,షేక్ బాషా,వన్నెంరెడ్డి ప్రసాద్,గడ్డంరాజు పింఛన్ లబ్ధిదారులు సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంది



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలుపరుస్తుందని మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలోని మచిలీపట్నం మండలం అరిసెపల్లి గ్రామంలో రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సి సీ రోడ్లను, రూ.10 లక్షలతో వాటర్ ప్లాంట్ మరమ్మతు పనులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రారంభించారు. అంతేకాకుండా 8 మంది అర్హులైన వారికి కొత్తగా మంజూరైన పింఛన్లు వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వర రావు, వైస్ ఛైర్మన్ చిలంకుర్తి పిచ్చయ్య,స్థానిక జనసేన నాయకులు గళ్ళాతిమూతి, అమ్మిరెడ్డి శివ, రామదేను వేణు, లంకే శేషగిరి పాల్గొన్నారు.

## మీట్ యువర్ డిఎస్పీ మచిలీపట్నం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా బందరు డిఎస్పీ కార్యాలయంలో ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు మీట్ యువర్ డీఎస్పీ కార్యక్రమం నిర్వహిస్తున్నారని బందరు డిఎస్పీ సిహెచ్ రాజా తెలిపారు.ప్రజాసమస్యల పరిష్కారం కోసం బందరు సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పవచ్చుని, బాధితులు ఫిర్యాదులను పరిశీలించి, సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.బందరు సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను వివరించేందుకు, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

## వర్ధిని మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల ఆగస్టు 1 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మర్రివాడ గ్రామంలో పెద్దిబోయిన వర్ధిని మరణించగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె అంతిమయాత్రలో కూడా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పది కుటుంబాలకు వాసవీ వృథ్యాప్య పెన్షన్స్ పంపిణీ



**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్:** ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వాహకులు పారేపల్లి సాయిబాబు నేతృత్వంలో నిర్వహించారు. ఒక్కో కుటుంబానికి 500 చొప్పున 10 నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు రూ. 5000లు చేశారు. నందిగామ సమీపం, చింతలపాడు వాస్తవ్యులు,చందర్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గా పనిచేసి రిటైర్మెంట్ అయి ప్రస్తుతం హైదరాబాదులో నివసిస్తున్న కొప్పు రాధాకృష్ణమూర్తి వారి ధర్మపత్ని కొప్పు కస్తూరి దేవి (ప్రభుత్వ పాఠశాల గ్రేడ్ 1 హిందీ పండిట్) వారిని స్మరించుకుంటూ ఆ కుటుంబం తరపున స్థానికంగా ఉన్న వారి బంధువైన కొప్పు రజిని నందిగామ, నాలుగో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మారం అమరయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## కోడూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణి



**కోడూరు మేజర్ న్యూస్:** ఈరోజు నుండి కొత్తగా మంజూరు చేసిన జీవిత భాగస్వామి( స్పౌస్) పెన్షన్లు కూడా ఇవ్వడం జరిగింది. శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, స్పౌస్ పెన్షన్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కూటమి సభ్యులు పెన్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణాపురం, నాయుడుపేట, మెరక గౌడ పాలెం,తూర్పు వైపు పెన్షన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కోడూరు జనసైనికులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా నూతన పింఛన్లు పంపిణీ



కోడూరు మేజర్ న్యూస్ : కోడూరు మండలం మాచవరం గ్రామ పరిధిలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను కూటమి నేతలు వారి ఇళ్లకు వెళ్లి అధికారులతో కలసి పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో మాచవరం గ్రామ సర్పంచి అప్పికట్ల లక్ష్మి. కోడూరు మండలం తెలుగు యువత అధ్యక్షుడు కూరాకుల శివప్రసాద్. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూరాకుల శివయ్య. మాచవరం బూతు కన్వీనర్ అప్పికట్ల సుబ్రహ్మణ్యం. ఏ ఆంజనేయులు. ఏ చిన్న వెంకటేశ్వరరావు. మాచవరం గ్రామ రెవెన్యూ అధికారి మణి బాబు. వి కొత్తపాలెం సచివాలయ వెల్ఫేర్ తుంగల లక్ష్మి శ్రీనివాస్ మొదలగున్నవారు పాల్గొనడం జరిగింది..

## రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన

**కోడూరు మేజర్ న్యూస్ :** కృష్ణాపురం లోని రామాలయం పునర్ ప్రారంభం మహోత్సవం శుక్రవారం ఉదయం 4,28, గంటలకు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ఇంకొల్లు సత్యనారాయణ దంపతులు, విశ్వనాధుని వెంకటేశ్వరరావు దంపతులు, కోట కృష్ణ ప్రసాద్ దంపతులు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

## అర్హులందరికీ పెన్షన్లు

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేస్తున్నారని గ్రామ పార్టీ అధ్యక్షులు కొండపాటి సుబ్బారావు అన్నారు. మండలంలోని చీమలపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన 12 పెన్షన్లు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ పార్టీ కార్యదర్శి జంగా స్టాలిన్, మండల బీసీ నాయకులు బెజవాడ శంకర్, మాజీ సర్పంచ్ మోర్ల తిరుపతిరావు, మండల మైనార్టీ నాయకులు ఎస్కే ఆదాం షరీఫ్, మండల ఎస్సీ సెల్ నాయకులు మేకల జాన్,బీసీ నాయకులు బెజవాడ ఆదిశేషు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గాయపడిన రమాదేవిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



**పమిడిముక్కల ఆగస్టు 1 మేజర్ న్యూస్ :** ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడిన మంటాడ సచివాలయం, రెడ్డిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ దారపు రమాదేవి రెడ్డిని పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రమాదేవి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమెకు సూచించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, గత సంవత్సరం పార్టీ ఓటమి కారణంగా మానసిక ఆందోళనకు లోనై బలవన్మరణానికి పాల్పడిన బచ్చు కనకారావు కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా ఆర్థిక, మానసిక మద్దతు అందిస్తున్నామని, ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మరింత మద్దతు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలపై తాను ఎప్పటికప్పుడు బాధ్యతగా ఉండి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరంతరం ప్రయత్నిస్తున్నానని అన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పమిడిముక్కల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్ బాబు, ఎంపిటిసి సభ్యురాలు మేరుగ లక్ష్మి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కంభపు రాంబాబు, పంచాయతీ విభాగ రాష్ట్ర నాయకులు నామ వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కోడెబోయిన కోటేశ్వరరావు, పార్టీ కార్యదర్శి కంభపు లక్ష్మయ్య, మొవ్వ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, కొలవన్ని పద్మ, ఉమ్మడిశెట్టి శ్రీలక్ష్మి, వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కలపాల వెంకటరమణ జన్మదిన వేడుకలు



**గన్నవరం, ఆగస్టు 01, మేజర్ న్యూస్ :** గన్నవరం లో ప్రముఖ న్యాయవాది కలపాల వెంకటరమణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎప్పుడు ప్రజా సేవలో ఉండే న్యాయవాది తన పుట్టినరోజు నాడు పేద ప్రజలకు సాయం చేసి అండగా నిలిచారు. శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా తన తల్లి రిటైర్డ్ ఉపాధ్యాయురాలు స్వర్గీయ ఝాన్సీ లక్ష్మిభాయి ట్రస్ట్ పేరు మీద 50 మంది సింగిల్ పేరెంట్ విద్యార్థుల కు చదువుకునేందుకు ప్రతి ఒక్కరికి 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్న ప్రముఖ న్యాయవాది. అంతే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉన్న అనాధ శరణాలయాలకు, వృద్ధాశ్రమాలకు తన వంతు సాయం గా దుస్తులు, పండ్లు, బియ్యం, పంపిణి చేసి, పేద ప్రజలకు పేద విద్యార్థుల కు బస్ పాస్ లు పంపిణి చేసి పేద వారికి సహాయం చేయడం లో ఉన్న ఆనందమే వేరు అంటున్న కలపాల వెంకటరమణ. వెంకటరమణ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసేందుకు గన్నవరం నియోజకవర్గం లో పలు గ్రామాల నుండి భారీగా తరలి వచ్చిన అభిమానులు. శుభాకాంక్షలు తెలియజేసిన ముఖ్య నాయకులు మాజీ ఏ ఎం సి చైర్మన్ పొట్లూరి బసవరావు గన్నవరం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరావు, జాస్తి ఫణి, ముస్తాబాద్ టీడీపీ నాయకులు మురళీ, శివ, మండవ అన్వేష్, కొండేటి కొండ, నిడమర్తి బుజ్జారావు, నల్లమోతు రమేష్, కె వి ఆర్ కిషోర్, బట్టు రిషి, పలువురు బార్ అసోసియేషన్ సభ్యులు, నాయవాదులు తదితరులు పాల్గొని ప్రముఖ న్యాయవాది కలపాల వెంకటరమణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## కొత్తగా లక్ష మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు



**గన్నవరం, ఆగస్టు 01, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 1.09 లక్షల మంది వితంతువులకు స్పౌజ్ పింఛన్లను ఈనెల నుండి పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో శుక్రవారం ఉదయం కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా స్పౌజ్ పింఛన్ లను ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా లబ్ధిదారులు అందించారు. పింఛన్ల పంపిణీ సందర్భంగా గ్రామానికి వచ్చిన యార్లగడ్డకు నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. లబ్ధిదారులను, స్థానికులను ఆప్యాయంగా పలకరించిన యార్లగడ్డ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఒకటవ తేదీ పబ్లిక్ హాలిడే అయితే ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము ఇంటి వద్దకు వెళ్లి అందిస్తూ వారికి ఆసరాగా నిలుస్తున్నామన్నారు. ఆగస్టు నెలలో 2,750 కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోస పింఛన్ల రూపంలో లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్ష వైసీపీ కుట్రలు చేయడం శోచనీయమన్నారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన ప్రతిపక్ష పార్టీ నాయకులను రాజకీయాల నుంచి బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో గన్నవరం నియోజకవర్గాన్ని ముందుకు తీసుకు వెళ్ళేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నట్లు ఈ సందర్భంగా యార్లగడ్డ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్ (సూర్యం), నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, పిఏసిఎస్ అధ్యక్షులు మేడేపల్లి రమ, బోడపాటి రవికుమార్, గ్రామ టీడీపీ అధ్యక్షులు కడియాలా రాజశేఖర్, మల్లికార్జున రావు, జనసేన నాయకులు చీమాట రవివర్మ, ఎండిఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## మైలవరంలో 989 నూతన పింఛన్లు మంజూరు



**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** మైలవరం నియోజకవర్గంలో 989 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు కాగా, వారికి ఈ నెలలో రూ. 39,56,000లు సొమ్మును తాజాగా అందజేసినట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. వివిధ కారణాల వల్ల భర్తలు మరణించిన వితంతువులకు నూతన పింఛన్లు మంజూరయ్యాయి.కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం శక్తి నగర్ కమ్యూనిటీ హాల్ లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మంజూరైన నూతన పింఛన్ సొమ్మును శాసనసభ్యులు కృష్ణప్రసాదు శుక్రవారం లబ్దిదారులైన మహిళలకు అందజేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ జి.కొండూరు మండలంలో 160 మందికి రూ. 6.40 లక్షలు, కొండపల్లి మున్సిపాలిటీలో 80 మందికి రూ. 3.20 లక్షలు, ఇబ్రహీంపట్నం మండలంలో 85 మందికి రూ. 3.40 లక్షలు, మైలవరం మండలంలో 183 మందికి రూ. 7.32 లక్షలు, రెడ్డిగూడెం మండలంలో 178 మందికి రూ. 7.12 లక్షలు, విజయవాడ రూరల్ మండలంలో 303 మందికి రూ. 12.12 లక్షలు నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు వివరించారు.కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5,260 మందికి రూ. 2.30 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.మైలవరం నియోజకవర్గ పరిధిలో 47,579 మందికి రూ. 20.45 కోట్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జీవిత భాగస్వామి విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా 1,09,155 మంది వితంతువులకు కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛను తీసుకుంటూ చనిపోయిన వారి భార్యలకు మరుసటి నెల నుంచి పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే 2019 మే నెల నుంచి 2024 అక్టోబరు మధ్య కాలంలో పెన్షన్ తీసుకుంటున్న భర్తను కోల్పోయిన మహిళలకు పెన్షన్ మంజూరు కాలేదన్నారు. అలా మిగిలిపోయిన వారిని గుర్తించి ఈ నెల నుంచి వారికి స్పౌజ్ కేటగిరీ కింద పింఛను మంజూరు చేసినట్లు తెలిపారు.పింఛన్ సొమ్ముతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.పేదల సంక్షేమంతో పాటు ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి దిశగా పీఎం మోడీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రమిస్తున్నారని అన్నారు. ఆగస్టు నెలలో సూపర్ సిక్స్ హామీలు మరో రెండు నెరవేర్చుతున్నట్లు పేర్కొన్నారు. రేపు 2వ తేదీన 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని అందజేస్తునట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి 'స్త్రీ శక్తి' పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# పారమౌంట్ ఇండస్ట్రీని సందర్శించిన మాజీ మంత్రి నెట్టెం రఘురాం



**పెనుగంచిప్రోలు, ఆగస్టు 1, మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు మండల పరిధి లోని కొనకంచి క్రాస్ రోడ్‌లో గల పారామౌంట్ ఇండస్ట్రీస్‌ను తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రాఘురామ్ శుక్రవారం పారామౌంట్ ఇండస్ట్రీనిసందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల పారామౌంట్ కంపెనీలో చోటుచేసుకున్న కొన్ని దురదృష్టకర సంఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. కొద్దిమంది ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని, ఇటువంటి అనుచిత ప్రవర్తనను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని తెలిపారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల నిర్లక్ష్యచర్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వంలో అవినీతి అధికారులకు స్థానం లేదని తేల్చి చెప్పారు.ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉందని చెప్పారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం పూర్తిగా నాశనం అయ్యిందని, పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వెన కడుగు వేసినట్లు చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో ఏర్పాటు అయిన కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో, మళ్లీ పారిశ్రామిక రంగం ఉత్తేజాన్ని పొందుతోందని, ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతుం దని నెట్టెం రఘురాం వివరించారు.ఈ సందర్భంగా ఆయన పారామౌంట్ సంస్థ అధినేత వెనిగళ్ల సురేష్ బాబు సేవలను ప్రశంసించారు. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి, ఎంతో కష్టపడి పరిశ్రమను స్థాపించి, స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు. ప్రస్తుతం ఈ కంపెనీ ద్వారా 400కు పైగా స్థానిక కుటుంబాలు, ఇతర జిల్లాల నుండి వచ్చిన 300 కుటుంబాలు మొత్తంగా 700కు పైగా కుటుంబాలు జీవనాధారాన్ని పొందుతున్నాయి.కంపెనీ విస్తరణ పనులను పరిశీలించిన అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి మద్దతును ప్రకటించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చేసి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. అలాగే కంపెనీ సిబ్బంది, ఉద్యోగులు తమ తమ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.వెనిగళ్ల సురేష్ బాబు వ్యక్తిగతంగా అందుబాటులో లేకపోయినా, ఫోన్ ద్వారా నెట్టెం రఘురాం తో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలపై ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ, మద్దతు ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు.




## డేటా ఎకానమీ,ఫ్యూర్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కంచికచర్ల హైస్కూల్లో స్టేజి నిర్మాణం

**కంచికచర్ల ఆగస్టు1 మేజర్ న్యూస్ :** పుట్టిన ఊరు,చదువుకున్న పాఠశాలపై మకారంతో ఏదైనా చేయాలన్న తలంపుతో తాను, తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డేటా ఎకానమీ సీఈవో కోపూరి రవిశంకర్ తెలిపారు. విదేశాలలో ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడిన కోపూరి కంచికచర్ల జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల అసెంబ్లీ నిర్వహణకు అవసరమైనటువంటి స్టేజ్ నిర్మాణం గురించి తన దృష్టికి రావడంతో ఫ్యూర్ స్వచ్ఛంద సేవా సంస్థ, డేటా ఎకానమీ సాఫ్ట్వేర్ కంపెనీ సహకారంతో రవి శంకర్ కోపూరి స్టేజి నిర్మాణాన్ని పూర్తి చేశారు. గురువారం హై స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో డేటా ఎకానమీ సీఈవో కోపూరి రవిశంకర్, ఫ్యూర్ చీఫ్ ప్రోగ్రాం ఆఫీసర్ కంఠమనేని హేమ చేతుల మీదుగా అసెంబ్లీ స్టేజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డేటా ఎకానమీ సీఈఓ రవిశంకర్ మాట్లాడుతూ తాను ఇదే హైస్కూల్లో విద్యనభ్యసించానని, చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత చేయాలనే తలంపుతో ఫ్యూర్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి స్కూల్ స్టేజి నిర్మాణం చేయడం జరిగిందని రవిశంకర్ తెలిపారు. కరోనా కష్టకాలంలో సైతం ఫ్యూర్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి సంస్థ ప్రతినిధులు ఎందరో మన్ననలు పొందారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు ఈ ప్రాంతంలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యూర్ డైరెక్టర్స్ కోగంటి శాంతి, కొలంబస్ ఫ్యూర్ ఆర్గనైజేషన్ సాధినేని లత, కంచికచర్ల ఫ్యూర్ కోఆర్డినేటర్ కోపూరు ఫణికుమార్, తదితర కోఆర్డినేటర్లు, మండల విద్యాశాఖ అధికారి, హై స్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో రెండవ శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు



**కంచికచర్ల ఆగస్టు 1 మేజర్ న్యూస్ :** శ్రావణమాసం రెండవ శుక్రవారము పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మీ అమ్మ వారి ఆలయంలో విశేష పూజలు, కుంకుమ అర్చనలు జరిగాయి. అమ్మ వారిని ప్రత్యేక అలంకరణ చేయడం జరిగిందని ఆలయం ప్రధాన అర్చకులు కాకాని పవన్ కుమార్ బాబీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కాకాని పవన్ కుమార్ బాబీ మాట్లాడుతూ, ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలో పాల్గొన్నట్లు తెలిపారు. శుక్రవారం అమ్మవారికి విశేష మైన రోజు అని, అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారి ప్రభ బండి కంచికచర్ల పట్టణ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్ని అమ్మవారి నీరాజనం మంత్రపుష్పం తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలియజేశారు.

## నేడు "సుఖీభవ" విడుదలకు అన్నదాతల సమావేశం

**గుడ్లవల్లేరు ఆగస్టు 1 మేజర్ న్యూస్:** రైతులకు పెట్టుబడి సాయం కొరకు అందజేసే అన్నదాత సుఖీభవ నిధుల విడుదల 2/08/2025 శనివారం ఉదయం 9 గంటలకు మన గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ భవనంలో, (మార్కెట్ యార్డు పక్క) జరుగుతుందని గుడ్లవల్లేరు మండల వ్యవసాయ అధికారి సునీల్ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే కార్యక్రమం గుడివాడ ఎంఎల్ఏ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందని, కావున రైతులు అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా ఏఓ సునీల్ కోరారు.

# పేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఆర్థిక భరోసానిస్తుంది



**వత్సవాయి :ఆగస్టు 1 మేజర్ న్యూస్ :** అర్హత కలిగిన ప్రతి పేదవానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ఆర్థిక భరోసాని ఇస్తుందని స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద కొత్తగా మంజూరైన పెన్షన్లను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శ్రీరాం రాజగోపాల్ స్వయంగా ప్రతి లబ్ధిదారులు ఇంటికి వెళ్లి పెన్షన్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అర్హత కలిగిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దివ్యాంగ సమస్యలు ఎదుర్కొంటున్నవారితో పాటు అన్ని వర్గాల వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు అందుతున్నాయి. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి కి లబ్ధి పొందే వరకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది" అని తెలిపారు. అలాగే పెన్షన్ లబ్ధిదారులు ఈ పథకం ద్వారా కొంతమేరకు ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పెన్షన్లు అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు నెల్లూరు శ్రీనివాసరావు చెన్నా బాలకృష్ణ పెద్ది రామారావు చింతూరి రమేష్ వడ్లమూడి నగేష్ ఏసుపోగు వెంకటేశ్వర్లు పాపగంటి వెంకటప్పయ్య, షేక్ లాలు,కత్తి లచ్చన్న, స్థానిక ప్రభుత్వ అధికారులు కూటమి పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏడో వార్డులో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ షేక్ అస్మతున్నీసా, షేక్ కౌసరున్నీసాలకు నూతన పింఛన్లు అందచేశారు. మద్దాల రాజారావుకు రూ.15 వేలు పింఛన్ అందచేశారు. మండలంలో 88 మంది వితంతువులకు నూతన పింఛన్లు మంజూరు అయినట్లు తెలిపారు. వీటిలో అవనిగడ్డ గ్రామంలో 41 పింఛన్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఇంచార్జి ఎంపీడీఓ వనజ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఎంపీటీసీ బొప్పన భాను, పంచాయతీ ఈఓ తోట శ్రీనివాసరావు, షేక్ బాబావలీ, లుక్కా శ్రీనివాసరావు, గౌస్ పాల్గొన్నారు.

## 80 నిమిషాల వ్యవధిలో 68 పెన్షన్లు పంపిణీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దక్షిణ చిరువోలు గ్రామంలో సచివాలయం పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ -6(డిజిటల్ అసిస్టెంట్) గావిధులు నిర్వహిస్తున్న డి.పద్మావతి నూతనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన స్పౌస్ (విడో) పెన్షన్‌ను అదపా నాగేశ్వరమ్మ అనే ఫించన్ దారులాలకి రూ.4,000లని అందజేశారు. శుక్రవారం తనకు కేటాయించిన 69 పించన్లు కు 68 పించన్లు పంపిణీ చేయగా ఒక పింఛను దారులాలు పని నిమిత్తం హైదరాబాద్ లో వెళ్ళారు. వేకనూరు గ్రామం లో ఉదయం 6.30 నిమిషాలు కు స్టార్ట్ చేసి ఎనిమిది గంటల సమయం లోపు పించన్లు పంపిణీ పూర్తి చేయడం జరిగింది.ఈ సందర్భంగా వేకనూరు గ్రామ ప్రజలుకు ఉదయాన్నే వచ్చి 80 నిమిషాల వ్యవధిలోనే పించన్లు అందజేయడం సంతోషంగా ఉంది అని హర్షం వ్యక్తం చేశారు.

## ప్రయాణికులకు అసౌకర్యం కలగనివ్వం

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ప్రయాణికులకు అసౌకర్యం కలగనివ్వమని అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన చల్లపల్లి బస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 15వ తారీఖు నుండి ప్రయాణికుల సంఖ్య పెరగనున్న నేపథ్యంలో బస్టాండ్లలో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డిపో పరిధిలోని అన్ని బస్టేషన్లను పరిశీలించి విద్యుత్సౌకర్యం, తాగునీటి వసతి, ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు, ఫ్యాన్లు, టాయిలెట్స్ వాటి పనితీరు మెరుగుపరిచేందుకు సిబ్బందికి తగు సూచనలు చేశామన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల పట్ల గౌరవ మర్యాదలతో మెలగాలని ఆదేశాలిచ్చామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కూచిపూడి, మొవ్వ, చల్లపల్లి బస్ స్టేషన్లను సం దర్శించి సౌకర్యాల మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ పి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## చల్లపల్లిలో 137 వితంతు పించన్లు మంజూరు



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సామాజిక ఫించన్లను మంజూరు చేసింది. భర్త చనిపోయిన మహిళలకు వితంతు ఫించన్లను రాష్ట్రవ్యాప్తంగా మంజూరుచేసి శుక్రవారం పంపిణీ చేశారు. చల్లపల్లి మండలంలో కొత్తగా 137 మందికి వితంతు పింఛన్లు మంజూరు కాగా, ప్రజాప్రతినిధులు, కూటమినేతలు, అధికారులు గ్రామాల్లో లబ్దిదారులకు ఫించన్లు అందచేశారు. చల్లపల్లి ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్లు పైడిపాముల కృష్ణకుమారి, డొక్కు నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప కుమార్, ఈవో పివి. మాధవేంద్రరావు తదితరులు ఫించన్లు పంపిణీ చేసిన వారిలో ఉన్నారు. ఎం పీడీవో ఎవి.రమణ, డిప్యూటీ ఎండీపీవో రవిశంకర్ల పర్యవేక్షణలో ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి సర్పంచ్లు, ఎంపీటీసీలు, నేతలతో కలిసి గ్రామాల్లో పించన్లు పంపిణీ చేశారు.

# పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన బెరాకా మినిస్ట్రీస్ సేవలు





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బెరాకా మినిస్ట్రీస్ సంస్థ సేవారంగంలో ఇలాగే తమ సేవలు కొనసాగిస్తూ, పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడాలని, కృష్ణా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. గురువారం బెరకా మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో గీతాంజలి శర్మ, చేతుల మీదుగా 23 మంది విద్యార్థులకు వారి విద్య నిమిత్తం లాప్టాప్, మరో పేద వ్యక్తి వైద్యం కొరకు రూ.7,70,502ల ఆర్థిక చేయూత బెరాకా మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ అందించారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ బెరాకా మినిస్ట్రీస్ సేవలను ప్రశంసించారు. బెరాకా మిని స్ట్రీస్ సంస్థ తమ సేవా కార్యక్రమాల ద్వారా పేద ప్రజల గుండెల్లో చిరస్థా యిగా నిలిచిపోవాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం పి- ఫోర్ ద్వారా ఆర్థికంగా స్థితి మంతులైన వారు, అభివృద్ధి చెందిన వారు, పేదల అభ్యున్నతికి పాటుపడి, వారి సర్వోత్తమ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడమే అన్నారు. పేదరిక నిర్మూలనే పి- ఫోర్ లక్ష్యం అన్నారు.

బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నిస్వార్థంగా సేవలు అందించడం అత్యంత ఆవశ్యకం అన్నారు. స్వచ్ఛంద సంస్థలు నిస్వార్థంగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగ నిలిచి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి దోహదపడతాయన్నారు. తమ బెరాకా మినిస్ట్రీస్ సంస్థ ద్వారా సాయం కోరి వచ్చిన వారికి, వెంటనే చేయూత అందిస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బెరాకా మినిస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ తిరుమాని వెంకటేశ్వర రావు తుమ్మల శివ ప్రసాద్, నాగిశెట్టి దాని యల్,లోగిశెట్టి స్వామి,పడమట నాగరాజు పాల్గొన్నారు.

# ఆమె భవిష్యత్తు - మన బాధ్యత








**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆమె భవిష్యత్తు మన బాధ్యత అని కృష్ణా జిల్లా డిఎంహెచ్వో శర్మిష్ట అన్నారు. మచిలీపట్నం తపాలా శాఖ కార్యాలయం ద్వారా, స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎంహెచ్వో శర్మిష్ట మాట్లా డుతూ సుకన్య సమృద్ధి ఖాతా అనేది ఆడపిల్ల సంపద పథకం అని, ఆడపిల్ల మైనర్ గా ఉన్న సమయంలో పొదుపు చేస్తే మేజర్ అయ్యేనాటికి ఆడపిల్లకు అంది వస్తాయన్నారు. ఈ పథకం ద్వారా ఆడపిల్ల తండ్రికి భారం ఉండద న్నారు. ఆడ పిల్లల కోసం 2015 జనవరి 22 న ప్రధాని నరేంద్ర మోదీచే ప్రారంభించబడిన ఒక ప్రత్యేక డిపాజిట్ పథకం ఇది అన్నారు.పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పథకం కింద 8.2 శాతం వడ్డీ అందించబడుతుందన్నారు. దీనికి ఎటువంటి పన్ను లేదన్నారు. ఇది సేవింగ్స్ ఖాతా మాత్రమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి పిల్లల చదువుల కోసం, వాళ్ల భవిష్యత్ కో సం ఎంతో ఉపయోగం పడుతుందని తప్పనిసరిగా ఈ స్కీంని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మార్కెటింగ్ మేనేజర్, ఈశ్వర రావు, సెయింట్ ఫ్రాన్సిస్ ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం.. సంక్షేమంలో సమున్నత పయనం...





**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా 1,10,000 నూతన వితంతు పెన్షన్లను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల్లో తన నిబద్ధతను చాటుకుంటోంది. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్ప టికీ, సంక్షేమ కార్యక్రమాలను విస్మరించకుండా పేద, అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను ఉన్నతం చేయడానికి కూటమి ప్రభుత్వం అవిశ్రాం తంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలో, నందిగామ పట్టణంలోని 16వ వార్డు దుర్గానగర్‌లో ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లను స్వయంగా పంపిణీ చేశారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ కింద ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ స్కీమ్ ద్వారా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు,, దీర్ఘకా లిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఆర్థిక సహాయం అందించబడుతోంది. ఈ పథకం కింద వితంతువులకు నెలకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000, పూర్తి వైకల్యం ఉన్నవారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధప డేవారికి రూ.10,000 వరకు పెన్షన్ అందించబడుతోంది. ఈ పెంచిన పెన్షన్ మొత్తాలు 2024 జులై నుండి అమలులోకి వచ్చాయి, ఇది రాష్ట్రంలోని 63 లక్షల మంది లబ్ధిదారులకు ఏటా రూ.33,100 కోట్ల వ్యయంతో అందించబడుతోంది. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, "రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించకుండా పేద ప్రజల సంక్షేమం కోసం అవిరళ కృషి చేస్తోంది. పెన్షన్ల పంపిణీలో పారదర్శకత, సమయపాలనను నిర్ధారించడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు సేవ చేస్తోంది" అని అన్నారు. నందిగామ పట్టణంలోని 16వ వార్డు దుర్గానగర్ వార్డులో, నందిగామ మండలం పెద్దవరం గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం స్థానిక లబ్ధిదారులకు ఆర్థిక భరోసాను, గౌరవ జీవనాన్ని అందించే దిశగా ఒక ముందడుగుగా నిలిచింది.కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా సమాజంలోని బలహీన వర్గాలైన వృద్ధులు, వితంతువులు, వికలాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో తన నిబద్ధతను చాటుకుంది. ప్రతి నెలా మొదటి రోజు ఉదయం 9 గంటలలోపు 80% మంది లబ్ధిదారులకు పెన్షన్లు చేరేలా చేయడం, 98% పంపిణీని మొదటి రోజే పూర్తి చేయడం వంటి విధానాలు ప్రభుత్వ పారదర్శకతను, సమర్థతను తెలియజేస్తున్నాయి.ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమాన్ని కొనసాగిస్తూ, ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో సమున్నత భవిష్యత్తు నిర్మాణానికి కృషి చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా, నందిగామ నియోజకవర్గంలోని ప్రజలు కూడా ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందుకుంటూ, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ లోవా రాజ్, పట్టణ,మండల అధ్యక్షులు ఏచూరి రాము, వీరంకి వీరాస్వామి,సచివాలయ అధికారులు, కూటమి నేతలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన పెన్షన్లు మంజూరుపై రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ హర్షం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం పరిధిలోని స్థానిక 15వ డివిజన్లో ఇటీవల పెన్షన్ తీసుకునే భర్త చనిపోయిన ఐదుగురు మహిళలకు పెన్షన్లు మంజూరు చేయడంపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రాకి కృతజ్ఞతలు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ తెలియజేశారు. ఈనెల 15వ తారీఖు నుండి మొదలయ్యే ఉచిత బస్సు పథకంపై డివిజన్ ప్రజలు, కార్యకర్తలు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ట్రెజరర్ సయ్యద్ సిరాజుద్దీన్, ఎండి అమీన్, నూరుద్దీన్ సచివాలయం సిబ్బంది, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుంటముక్కలలో కూటమి సభ్యులు కొత్త పెన్షన్లు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** కుంటముక్కలలో కొత్తగా శాంక్షన్ అయినా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు (12 వితంతుపెన్షన్లను) శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు గ్రామంలో లబ్ధిదారులకు అందజేశా రు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు లంక రామకృష్ణ వరప్రసాద్, సుఖవాసి శ్రీహరి,సందీపా ము జయలక్ష్మి, లంక నాగేశ్వరావు, మనం నాగేశ్వరావు,ఎడవల్లి వెంకటేశ్వరావు,కే వెంకటేశ్వ రావు, లింగాల ఎండిఓ రామకృష్ణ నాయక్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి మొదటి లీడర్ తల్లిదండ్రులే..



**నందిగామ, ఆగస్టు 1, మేజర్ న్యూస్:** గురువులు, నాయకులు అని తల్లిదండ్రులు చెప్పే మాటలను శ్రద్ధగా విని, వాటిని పాటించే విద్యార్థులకు అభివృద్ధి, మంచి ప్రవర్తనకు ఎంతో సహాయపడుతుందని ఏకత్వ పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ అమరనేని మనోజ్ అన్నారు. వీర్లపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వ పాఠశాలలో శుక్రవారం ఉదయం విద్యార్థి నాయకుల ఎన్నికలను (ఇన్వెస్టిచర్ సెర్మని) ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయులు ఐశ్వర్య సాంబశివన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ అమరనేని మనోజ్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ఇలా మాట్లాడారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో తమ యొక్క తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం ఈ వేడుకలో కొత్తగా ఎన్నిక కాబడిన కౌన్సిల్ సభ్యులను అధికారికంగా నియమిస్తూ వారికి బాధ్యతలు అప్పగించబడిన అద్భుతమైన క్షణమది. పాఠశాల విద్యార్థి నాయకుల అందరు పాఠశాల క్రమశిక్షణతో కూడిన అభివృద్ధికి తోడ్పడతామని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ అమరనేని సింధూర, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999